# తన్వి - తనివి

కమల అప్పుడే కాలేజీనుంచి వచ్చింది. పుస్తకాలు బల్లమీద పెట్టి లోపలికి చూసింది. అప్పుడే వరండాలోకి వస్తున్న సుజాత కనిపించింది. "వారు యింకా రాలేదా?" అని అడిగింది కమల.

"వచ్చాడు? గదిలో వున్నాడు" అంది సుజాత నెమ్మదిగా. కమల చేతి గడియారం వంక చూసుకుంది అయిదు గంటలయింది. ఆమె గబగబ గదిలోకి వెళ్ళింది. శేఖర్ వాలుకుర్చీలో కూర్చుని యేవో కాగితాలు చూసు కుంటున్నాడు. ఆమె గదిలోకి రావడం చూస్తూ కూడా గమనించనట్లే వుండిపోయాడు. కమల పెదవుల మీదికి చిరునవ్వు తెచ్చుకుంటూ "ఈ రోజు అప్పుడే వచ్చేశారే; నాకు చివరి పీరియడ్ క్లాసు వుంది-అందుకని అలస్యం అయింది" అంది. శేఖర్ ఏమీ మాట్లాడలేదు. కమల-"కాఫీ తీసుకున్నారా? యేమిటి చూస్తున్నారు అంది. కాగితాల్లోంచి తల పైకి ఎత్తకుండానే శేఖర్ "నీ లాలింపులన్నీ తరువాత, కాస్సేపు నన్ను ఒంట రిగా కూర్చోనివ్వు" అన్నాడు.

కమలకు ఎక్కడలేని నీరసం వచ్చేసింది. ఏమీ మాట్లాడకుండా ఆ గదిలోనుంచి బయటకు వెళ్ళిపోయింది. ఏదో చదువుకుంటున్నారు కాబోలు- అని ఎంత సర్దిచెపుదా మనుకున్నా కమలకు మనసు సమాధాన పడేటట్లు లేదు. తను చివరి గంటకూడా గొంతుబిగించుకొని పాఠం చెప్పి, అతను వచ్చేటప్పటికి యింట్లో లేకుండా ఎక్కడ పోతానో అని ఆదరా బాదరా పరుగెత్తుకుంటూ వచ్చింది. అయినా తన శ్రమ అంతా వృథా అనిపించింది యిప్పుడు.

దుస్తులు మార్చుకున్నాక కమలకు కాఫీ యిచ్చింది సుజాత. కాఫీ తాగుతూ కమల "వారు ఎన్ని గంటలకు వచ్చారు?" అంది.

"అన్నయ్య నాలుగు గంటలకే వచ్చేశాడు. ఎందుకో చాల కోపంగా వున్నాడు. కాఫీ యివ్వడం కాస్త ఆలస్యం అయిందని నన్ను కోపపడ్డాడు" అంది సుజాత.

ఆ కోపం అంతా తనమీద-అనుకుంది కమల మనసులో. మళ్ళీ గదిలోకి వెళ్ళి కూర్చోవాలంటే చాల చిరాకు అనిపించింది. కాని యింకో మార్గం లేదుగదా! ఆయన చిరాకుపడ్డా, కోపగించుకున్నా, ఆఖరుకు-తిట్టినా కూడా తను ఆయన్ను ఆశ్రయించుకునే వుండిపోవాలి!

కమల గదిలోకి వెళ్ళి కూర్చుంది. శేఖర్ యింకా కాగితాలు చూసుకుంటూనే వున్నాడు. ఆమెకు ఒక్కక్షణం ఆగి కాగితాలు లాగి అవతల పారేయాలని అనిపించింది. అలా చేస్తే అగ్గిమీద గుగ్గిలం వేసినట్లవుతుంది. తమాయించుకుని వూరుకుంది. పదినిమిషాలు గడిచాక శేఖర్ తను చూస్తూవున్న కాగితాలన్నీ బొత్తిపెట్టి బల్లమీదికి గిరాటు వేశాడు.

'మాట్లాడకుండా కూర్చున్నావేం' అన్నాడు శేఖర్. కమలకు మరింత నీరసం వచ్చినట్లు అయింది. 'ఏం మాట్లాడను' అంది

'మీ కాలేజీలో ఈ సంవత్సరం ఎవరూ కొత్త లెక్చెరర్లు చేరలేదా?'

'చేరారు యిద్దరు.'

'ఏ ఊరివాళ్లు ?'

'నాకు తెలియదు, మా డిపార్టుమెంటువాళ్ళు కాదు.'

'అయితే మాత్రం తెలియదా యేమిటి? ఆ మాత్రం తెలియకుండా వుంటుందా? నేనేం వాళ్ళను యెగరేసుకుపోనులే.'

'నాకు తెలీదండీ నిజంగానే!' అంది దాదాపు ఏడుపుముఖంతో.

శేఖర్ యింకేమీ ప్రస్తావించకుండా ఊరుకున్నాడు.

కాసేపు అయ్యాక కమల 'నాకు ఈ సంవత్సరం బి. ఏ. మూడవ తరగతి క్లాసులు కూడా యిచ్చారు' అంది.

'నీకు యివ్వటానికేం! మీ కాలేజీలో లేవు గాని వుంటే ఎం. ఎ. క్లాసులు కూడా యిస్తారు.'

కమలకు మనసులో మండిపోయింది. ఎందుకు ఇలా అర్థం లేకుండా ఎత్తి పొడుస్తాడు? అయినా పైకి మాత్రం చిరునవ్వు తెచ్చుకుంటూ 'ఇంకా నయం. రిసెర్చి వాళ్లకు గైడ్‌గా వేస్తారని అన్నారు కాదు' అంది. ఏ కళ నున్నాడో శేఖర్ ఈమాటను అంత సీరియస్‌గా తీసుకోలేదు. కాస్సేపు ఆగి ఆమె 'యేమిటి ఆలోచిస్తున్నారు?' అంది. శేఖర్ ఉలిక్కిపడ్డాడు.

'నిన్ను గురించే ఆలోచిస్తున్నాను' అన్నాడు,

'నన్ను గురించేనా, చెప్పరేం మరి! చెప్పండి యేం ఆలోచిస్తున్నారో' అంటూ కమల ఉత్సాహంగా కూర్చుంది.

'చెబితే నీకు కోపం వస్తుందేమోనని ఆలోచిస్తున్నాను.'

కమలకు మనసులో అనుమానం మెదిలింది. ఇంతసేపూ కస్సు బుస్సులు ఆడుతున్నవాడు యిప్పుడిట్లా అనునయంగా ఎందుకు మాట్లాడు తున్నాడు ? అతని మాటకు యేం జవాబు చెప్పడమా అని ఒక్క క్షణం ఆలోచించింది.

'నాకు కోపం వస్తుందో రాదో మీకు తెలుసునుకదా ! చెప్పండి ఆ మాట యేమిటో?' అంది చివరకు.

'ఏమీలేదు, కమలా! ఒక స్నేహితుడికి అర్జెంటుగా అవసరం వచ్చింది, రెండు వందలు కావాలి!'

'సరే దానికి నా పర్మిషన్ దేనికి?'

'నీ ప్రత్యేక పర్మిషన్ కావలసి వచ్చింది!' అన్నాడు శేఖర్ నింపాదిగా.

కమలకు ఈ మాటలు అస్సలు అర్థం కాలేదు. ఎందుకంటే వాళ్ళిద్దరికి బ్యాంకులో జాయింట్ ఎకౌంట్ వుంది. మొదటివారంలోనే ఇద్దరూ

ఆ ఎకౌంటులో డబ్బు జమ కడతారు. నెలపొడుగునా ఎవరికి కావలసింది వారు డ్రా చేసుకుంటారు. ఒకళ్లను ఒకళ్ళు అడగవలసిన పనిలేదు.

'ఏమిటో చెప్పండి? వివరంగా, నాకేమీ తెలియడంలేదు' అంది కమల.

శేఖర్ యిబ్బందిగా ముఖం పెట్టాడు.

'బ్యాంకులో డబ్బు లేదు కమలా! అందుకే నిన్ను అడుగుతున్నాను.'

కమలకు గుండె గతుక్కుమంది. ఆమె అంచనా ప్రకారం బ్యాంక్ ఎకౌంటులో అయిదారు వందలదాకా వుండాలి. కాని ఆ మాట గట్టిగా పైకి అనడానికి లేదు, ఏ మాట అంటే యేం అపార్థం చేసుకొంటాడో అని భయం. అంతవరకు ఆలోచించి యిలా అంది: "మన దగ్గర లేకపోతే మనమేం చేయగలం? లేదని చెప్పండి' అంది.

'కాదు కమలా! చాలా అర్జంటు!'

'అర్జంటయితే యేమిటి చెయ్యడం?'

'నీ దగ్గర వుంటే యివ్వు' అన్నాడు శేఖర్-దాదాపు రహస్యం చెబుతూన్న వాడిలా గొంతుపెట్టి.

'నా దగ్గరా!?' అంది కమల ఆశ్చర్యపోయి.

'అవును కమలా! నీ దగ్గరే. ఒక వారం రోజుల్లో మన డబ్బు మనకు పువ్వుల్లో పెట్టి తిరిగి యిచ్చివేస్తాడు.'

కమలకు దాదాపు యేడుపు వచ్చినంత పని అయింది. శేఖర్ ఉద్దేశ్యం యేమిటి? తను డబ్బు విడిగా దాచుకుంటూ వున్నదనా?

'నా దగ్గర లేదండి! జీతమంతా బ్యాంకులోనే వేస్తున్నానుగదా! వేరే నా దగ్గర ఎక్కడుంది?'

శేఖర్ ముఖకవళికలు మారిపోయినాయి.

'నీ జీతం యేం చేస్తున్నావు - అని అడగలేను నేను. అర్జెంటుగా కావాలి గనుక అడిగాను. ఎందుకలా బీద అరుపులు అరుస్తావు' అన్నాడు గొంతు చించుకొంటూ.

కమలకు యింక యేం చెప్పాలో తెలియలేదు. బిక్క ముఖం వేసుకుని అతనివైపు చూస్తూ కూర్చుండిపోయింది. శేఖర్ ఆమెను మింగే సేట్లుగా చూస్తున్నాడు. నాలుగు నిమిషాలు గడిచాక "అయితే ఏమంటావు? అన్నాడు.

"నేను అబద్ధం చెప్పడం లేదండీ! నా దగ్గర వేరేయేమీ డబ్బులేదు. నా మాట నమ్మండి" అంది.

శేఖర్ చివాలున కుర్చీలోనుంచి లేచాడు. "సరే నీ యిష్టం" అంటూ చరచర వెళ్ళిపోయాడు బయటకు.

* * *

అతను వెళ్ళిన తర్వాత ఒకమారు దీర్ఘంగా నిట్టూర్చింది కమల. ఆమె మనస్సు రకరకాల భావాలతో నిండిపోయింది. ఏమాటా పైకి అనడానికి వీలులేదు గనుక ఆమె తన మనసులోనే-తనలో తానే గుంజాటన పడసాగింది. వెనుకటి రోజులన్నీ ఒక్కమారు గుర్తుకు తెచ్చుకుంది. రోజులు గడుస్తున్నకొద్దీ తనలో యేమయినా మార్పు వస్తోందా అని పరికించి చూసుకుంది. ఆమెకు తనలో మార్పు యేమీ కనిపించలేదు. పరిస్థితులే మారిపోతున్నాయి. పరిస్థితులతోపాటు తాను మారలేకపోతూవుంది. అందువల్లనే తనకింత వ్యధ!

శేఖర్ తనతో ఎప్పుడూ ఇంత నిష్కర్షగా మాట్లాడలేదు, నీ డబ్బు, నా డబ్బు-అనే ప్రసక్తి తీసుకోరాలేదు. ఆమెకు ఈ సంఘటన ముందు ముందు యెటువంటి పరిణామాలకు విపరీతాలకు దారితీస్తుందో అని భయంగా వుంది. ఆమెకు యెన్నో భయాలు, కొన్ని కొన్ని ఊహలు మనసులోనికి వస్తేనే శరీరమంతా గజగజ వణికిపోతుంది.

డబ్బు-డబ్బు కోసం లోకంలో రకరకాలయిన తగాదాలు జరగడం అతి మామూలు విషయం అయిపోయింది. అందరికి డబ్బే ప్రధానం అంతే కాని మనుష్యులు వాళ్లవిలువలు యివేవీ అక్కర్లేదు ఎంత అయిన వాళ్ళ యినా డబ్బు చూపించినప్పుడే గౌరవం.

కాని తనుమాత్రం డబ్బు మనిషికాదు. తనకు డబ్బుమీద యెటు వంటి వ్యామోహం లేదు. కనీసం నా డబ్బు, నా యిష్టం అనే ధోరణి కూడా తనకు యెంతమాత్రం లేదు. ఇన్నాళ్ళు తను సంపాదిస్తున్నానన్న భావమే మనసులోకి తెచ్చుకోలేదు.

నిజానికి తనకు ఉద్యోగం చేయడమే యిష్టంలేదు. కాని శేఖర్ మాట తీసివేయలేక, శేఖర్ బలవంతం కొద్దీ ఉద్యోగం చేస్తోంది. అంటే తనకు యిష్టంలేకపోయినా, లేనిపోని కష్టాలన్నీ పడుతూ వున్నదనికాదు తాను యేమీ ఉద్యోగం చేయకుండా వున్నట్లయితే—ఈ రోజు ఈ సంఘటన జరిగేది కాదు. ఇటువంటి ఘటనలు తనకు సుతరామూ యిష్టంలేదు. కాని తన యిష్టం అంటూ యేం జరుగుతోంది గనుక! జీవితమంతా యాంత్రి కంగా, యెవరో చెప్పినట్లు చేయడం తప్ప తనకు యిష్టమా అయిష్టమా అని ఆలోచించుకొన్న రోజులు ఎక్కడున్నాయి?

తన చదువంతా తల్లిదండ్రుల యిష్టంమీద గడిచిపోయింది. పెళ్ళి అయేదాకా యింట్లో ఊరికే కూర్చోవడం ఎందుకని వాళ్ళు కాలేజీలో పడే శారు. కొన్నాళ్ళకు చదువు పూర్తి అయేదాకా పెళ్ళి ప్రసక్తి లేదు, అని వాళ్ళే తాత్సారం చేశారు. కళ్లుమూసి తెరిచేంత సేపటిలో తాను ఎం ఎ. అయి కూర్చుంది అప్పట్నించీ తన పెళ్ళికోసం తీవ్రంగా కృషిచేసి ఈ శేఖరాన్ని వెదికి పట్టుకున్నారు. పెళ్ళికూడా వాళ్ళ యిష్టప్రకారమే జరిగి పోయింది.

పెళ్లయి కాపురానికి వచ్చిన తరువాత "నీవు ఉద్యోగం చేయాలి కమలా!" అన్నాడు శేఖర్. "ఊహు" అంది తను. అతను ఎన్నో కార

ణాలు చెప్పి తనను ప్రోత్సహించాడు. నీకు ఎప్పుడు యిష్టం లేకపోతే అప్పుడే మానివేయవచ్చు-అన్నాడు. వుద్యోగం చేయకుండా వుండటానికి నీకు బలమయిన కారణాలు యేమీ లేనప్పుడు, చేయకపోవటంలో అర్థం లేదన్నాడు. అతని వాదనలన్నీ విని చివరకు తను అసహాయంగా 'సరే, మీయిష్టం' అంది. అనక తప్పలేదు తనకు.

నాలుగేళ్లు దొర్లి పోయినాయి. తను ఎంత సంపాదించిందో తనకు లెక్కలేదు. తనకోసం ప్రత్యేకం గొప్ప ఖర్చులుమాత్రం యేమీ చేయలేదు. తను చేస్తూవున్న పనల్లా జీతం తీసుకుపోయి బ్యాంకులో పడేయడం, అవసరం అనుకున్నప్పుడు తెచ్చుకుంటూ వుండడం! శేఖర్ యేం చేస్తున్నాడన్న విషయమే తను యెప్పుడూ ప్రత్యేకంగా గమనంలోనికి తెచ్చుకోలేదు. తన విషయమే తనకంత పట్టింపు లేనప్పుడు, అతనేం చేస్తున్నాడో తనకెందుకు?

శేఖర్‌కు చాలా ఖర్చులు వుంటాయని తనకు తెలుసు. అతను తండ్రికి కొంత డబ్బు పంపుతూ వుండడం కూడా తనకు తెలుసు. దాంట్లో కానిదేమీ ఆమెకు కనిపించలేదు కూడా.

తనకు ప్రత్యేకమయిన ఖర్చులు యేమీ లేవు. కనీసం తోటిలెక్చరర్ల లాగ ప్రతినెల ఒక విలువయిన చీర కొనుక్కునే అభిలాష కూడా లేదు తనకు. చిన్నప్పటినుంచీ అతి సరళమయిన జీవితం గడిపే తను యిప్పుడు తన సంపాదన చూసుకుని మురిసిపోవడం గాని, గంగవెర్రులు ఎత్తడంగానీ యేమీచేయలేదు.

నిజానికి తను ఈ విషయాలను గురించి అంత విపులంగా ఎప్పుడూ ఆలోచించుకోలేదు. కాని శేఖర్ అన్న మాటలు ఆమె మనస్సును యింకా సూదులలాగ పొడుస్తూనే వున్నాయి

డబ్బు తెచ్చిపెట్టే యిబ్బందులు తన జీవితంలో యిప్పుడే ఆరంభం అయినాయని ఆమెకు దుగ్ధ యేర్పడింది.

'స్వార్థం అంటే యేమిటో యెరగను. నా జీవితం యిలాగే నిష్కల్మషంగా నడిపించు భగవాన్! డబ్బు విషయంలో శేఖర్‌కు నాకు విభేదాలు రాకుండా చూడు. నాకు తెలిసినంతవరకు నాలో యేమీ దోషం లేదు-' అని ఆమె మనసులోనే దేవుడిని ప్రార్థించుకొంది. ఆమె అలా ఎంతసేపు ఆలోచిస్తూ కూర్చుండిపోయిందో తెలియదు. సుజాత వచ్చి 'అన్నయ్య రావడం ఆలస్యం అవుతుందేమో, మనమిద్దరం భోజనం చేసేద్దామా?' అనేదాకా ఆమెకు ఈ లోకం గుర్తుకు రాలేదు.

* * *

శేఖర్ యేమీ జరగనట్లే తన ధోరణిలో తను నడిచిపోతున్నాడు. కమలకు ఈ విషయం మళ్ళీ అతనితో ప్రస్తావించాలని వుంది. కాని అది యెట్లా సాధ్యమో అవగాహనకాక ఊరుకుండిపోయింది. ఆమెకు అతని ముఖంలోకి సూటిగా చూసి మాట్లాడడం కూడా కష్టం అయిపోతోంది. తనలో ఏమీ దోషం లేకపోయినా ఎందుకు తన మనస్సు యిట్లా వ్యధ పడిపోతోందో ఆమెకు సుతరామూ అర్థం కావడం లేదు. శేఖర్‌కూ తనకూ ఎక్కడ విభేదాలు వస్తాయో అని ప్రతిక్షణం భయపడుతూ వుంటుంది. భయపడడం తప్ప, ఆమెకు ఇంకేమీ చేతకావడంలేదు. ఇవన్నీ తలుచుకున్నప్పుడు-ఉద్యోగం మానేసి తను హాయిగా, అందరిలాగా యింటిపట్టున వుండిపోవడం మంచిది అనిపిస్తుంది. కాని ఉద్యోగంవల్ల తనకు వచ్చిన ప్రత్యేక యిబ్బందులు యేమీ లేవు. శేఖర్‌కు యేమని చెప్పడం? తను సంపాదించే డబ్బువల్ల తనకు ప్రత్యేకించి యేమీ ప్రయోజనం లేకపోవచ్చు కాని-జీవితం యిప్పుడున్నంత సుఖకరంగా అప్పుడు జరగదు. అందులో యేమీ సందేహం లేదు. శేఖర్ అందుకు సుతరామూ అంగీకరించడు. అంటే - ఒకరకంగా - తాను ఉద్యోగం చేయక తప్పని స్థితి వుందన్న మాట!

అట్లాగే ఉద్యోగం చేస్తాను. కాని నాకూ, శేఖర్‌కూ మాత్రం కలతలు రాకూడదు. నాకు అంతకంటె కావలసింది యింకేమీ లేదు — అనుకొంది కమల.

"నీవు ఈమారు పుట్టినరోజుకు యేంచీర కొనుక్కుంటావు?" అని అడిగాడు శేఖర్ ఒకనాడు. అనుకోకుండా వచ్చిన ఈ ప్రశ్నకు కమల నివ్వెరపోయింది. నిజానికి తన పుట్టినరోజు ఈ వారంలోనే అనే విషయం కూడా గమనం లేకుండా పోయింది ఆమెకు. తీరా లెక్కవేసుకు చూసు కుంటే మూడురోజులే వుంది.

ఈ నాలుగేళ్లుగా శేఖర్ తనను ఈ ప్రశ్న వేస్తూవుండడం అల వాటే. పుట్టినరోజు వారం రోజులుందనగా ప్రారంభం చేస్తాడు అడగడం. తనచేత ఎన్నో చెప్పించి, చివరకు తనకు యిష్టమయినది యేదో యెంచి తీసుకుంటాడు.

శేఖర్ గుచ్చిగుచ్చి అడిగినా కమల తనకేం కావాలో అడగలేక పోయింది. చెప్పలేక పోయింది. మనసులో ఒక మూల డబ్బును గురించి బెంగ. చేతిలో డబ్బు లేనప్పుడు ఎందుకు ఈ ఆడంబరాలన్నీ అను కుంటుంది.

రేపు పుట్టినరోజు అనగా-శేఖర్ ఆమెను మళ్ళీ అడిగాడు. ఆమె నిశ్చయంగా "నాకిప్పుడేమీ అక్కర్లేదు" అంది.

"అట్లా లాభంలేదు. నాదగ్గర యిప్పుడు డబ్బు లేదనుకున్నావా? ఇదుగో-చూడు" జేబులోంచి మూడు వందలు కాగితాలు తీసి చూపించాడు.

ఆమె ముఖంలో అనేక ప్రశ్నలు అవతరించాయి. వాటిని చద వడం అతనికేమంత కష్టంకాలేదు.

'నా స్నేహితుడి దగ్గర తీసుకున్నాను. పై నెలలో ఇచ్చేస్తానని. పోయినవారం నన్ను రెండు వందలు అడిగాడు. చూడూ—వాడి దగ్గర, వాడికి రావలసిన డబ్బు రెండురోజుల క్రితమే అందింది. వాడికి సమయానికి

నేనే సహాయం చేయలేక పోయినాను. నాదగ్గర డబ్బులేక నేను యేం యిబ్బంది పడుతున్నానో అని నేను వద్దంటున్నా మొన్న మూడు వందలు నా జేబులో కుక్కాడు వాడు అంత మంచి స్నేహితుడు. అందుకనే వాడికి సమయానికి రెండువందలు యివ్వలేక పోయినానే అని బాధకలిగింది. ఇంతకూ నీకు యేం కావాలో కోరుకో!'' అన్నాడు శేఖర్.

కమలకు కళ్ళల్లో నీళ్ళు నిండాయి. "నాకేమీ అక్కర్లేదు. మనిద్దరి మధ్య డబ్బును గురించి విభేదాలు రాకుండా వుండడమే నాకు కావలసింది. నన్ను మీరు అపార్థం చేసుకోవద్దు. ఇంతకంటే నేను యేమీ కోరేదిలేదు'' అంది కమల అతని వొడిలో వొదిగిపోతూ. *

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక)